నమస్తే తెలంగాణ
# మెదక్
I హైదరాబాద్, మంగళవారం 15 అక్టోబర్ 2024 MEDAK


సంగారెడ్డి జిల్లా అందోల్‌లో దసరా సందర్భంగా జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న హరీశ్‌రావు

# పేదల కడుపుకొట్టడమే కాంగ్రెస్ ఎజెండా

- రైతుబంధు ఎప్పుడు ఇస్తరో తెలియడం లేదు
- రుణమాఫీ డిసెంబర్ 9వరకు వాయిదా వేయడం విడ్డూరం
- పేదల కడుపునింపడమే కేసీఆర్ ఎజెండా
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సంగారెడ్డి జిల్లా అందోల్‌లో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో ధూంధాంగా అలయ్ బలయ్
- ఆటపాటలతో ప్రభుత్వ పనితీరును ఎండగట్టిన దేశపతి, రసమయి, గోరెటి

## కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజల బతుకులు ఆగం


సంగారెడ్డి జిల్లా అందోల్‌లో నిర్వహించిన అలయ్‌బలయ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, రసమయి, ఎమ్మెల్సీలు, బీఆర్‌ఎస్ నాయకులు

అందోల్, అక్టోబర్ 14: ప్రతి పేదవాడి కడుపు నింపాలన్నదే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచన అని.. పేదవాడి కడుపుకొట్టి పండుగపూట వారితో కన్నీళ్లు పెట్టించి ఆనందం పొందడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలసీ అని మాజీమంత్రి హరీశ్‌రావు, మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి ధ్వజమెత్తారు. సోమవారం అందోల్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్‌బలయ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీ జైపాల్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వాలన చేసి జమ్మిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ పది నెలల పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. పండుగలను సైతం సంతోషంగా జరుపుకోలేని పరిస్థితి వచ్చిందని, ఆడబిడ్డలకు కనీసం బతుకమ్మ చీరలు పంపిణీ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే మహిళలకు రెండు బతుకమ్మ చీరలు ఇస్తామన్నారు..? ఆ తర్వాత రూ. 500 అన్నారు... చీరలు ఎటుపాయే...రూ. 500 ఎటు పాయే అంటూ చురకలంటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయడం లేదని రైతుబంధు లేదు, రుణమాఫీ లేదు...ఉద్యోగాల ఊసేలేదని....మంత్రులు, సీఎంకు ప్రజల సంక్షేమంపై అసలు ధ్యాసే లేదని దుయ్యబట్టారు. ఎంతసేపు కేసీఆర్‌ను తిట్టడం...బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పనులనే తమ పనులుగా చెప్పుటుకుంటూ గొప్పలు పోవడం.. ఇదే అభివృద్ధి అంటూ ప్రజలను మభ్యపెటట్డంపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. బీఆర్‌ఎస్ స్వరాష్ట్రం కోసం ఉద్యమాలు చేసిందని...ఆ తర్వాత తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ఎన్నో సంస్కరణలు చేపట్టిదన్నారు. ఎన్నో బలిదానాలతో సాధించుకున్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ కష్టాల్లో నెట్టుతుందని, దీనిని ఎట్టి పరిస్థితిల్లోనూ అడ్డుకొని తీరుతామన్నారు. ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి, వారి కష్టాలు తొలిగించాలి కానీ కొత్త కష్టాలు సృష్టించ వద్దన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల నుంచి ప్రతిఘటన ఎదురవుతున్నదనే దానిని కప్పిపుచ్చుకునేందుకు కొత్త డ్రామాలకు తెరలేపుతున్నదన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టాలు వచ్చినా బీఆర్‌ఎస్ సైన్యం ముందుంటుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ఎన్నో కష్టనష్టాలకు తట్టుకుని కరువు ప్రాంతమైన నారాయణఖేడ్ వాసులకు మిషన్‌భగీరథ ద్వారా తాగునీరందించి దశాబ్దాల నీటి గోసను తీర్చారని..కానీ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో వాళ్లకు నీళ్ల కష్టాలోచ్చాయన్నారు. సంజీవ్‌రావు పేటలో మిషన్ భగీరథ నీళ్లు రాకబావి నీళ్లు తాగడంతో ఇద్దరు మృతి చెందగా, ఎంతో మంది అస్వస్థతకు గురై దవాఖానలో చేరారని దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన మునిపల్లి మాజీ మండలాధ్యక్షుడు అల్లం నవాజ్‌రెడ్డి, పెద్ద శంకరంపేట్ మండల మాజీ మండలాధ్యక్షుడు విజయరామారావుల చిత్రపటాలకు హరీశ్‌రావు బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు.

### ప్రభుత్వ పనితీరును ఎండగట్టిన దేశపతి, రసమయి, గోరెటి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులపాలు చేసిందని, పండుగలను సైతం సంతోషంగా జరుపుకోలేని పరిస్థితి ఏర్పడిందని గాయకుడు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, గోరెటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యే రసమయిబాలకిషన్ ఆటపాటలతో ప్రభుత్వ పనీతీరును ఎం డగట్టారు. బతుకమ్మ పండుగకు చీరలను సైతం అందించలేదని...రైతులకు రైతుబంధు లేదు, రుణమాఫీ చేయకుండా పండుగ పూట పస్తులుండేలా చేశారని...బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేండ్లు రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలన...కాంగ్రెస్ పది నెలల పాలనను వివరిస్తూ ఆటపాటలతో కార్యకర్తలో మరింత జోష్‌ను నింపారు. సుభిక్షంగా ఉన్న తెలంగాణ దుర్భిక్షంగా మారిందని....చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరిన సామేతను గుర్తుచేశారు. కళాకారుల ఆటపాటలు... మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రసంగాలతో అలయ్‌బలయ్ కార్యక్రమం ధూంధాంగా సాగగా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. గతానికి భిన్నంగా ఏడేండ్లుగా ఇక్కడ అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించడం సంప్రదాయంగా వస్తున్నదని.. అధికారం ఉన్నా.. లేకపోయినా.. ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటానని అందుకు నిదర్శనమే ఈరోజు అలయ్‌బలయ్‌కి తరలి వచ్చిన ప్రజానీకమని ...మీ ప్రేమను ఎన్నడూ మరిచిపోనన్నారు. కార్యక్రమంలో బిచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప, మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవీప్రసాద్, మాజీ ఎంపీపీ బాలయ్య, నాయకులు రాహుల్‌కిరణ్, పట్నం మాణిక్యం, శ్రీకాంత్‌గౌడ్, బుచ్చిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, నాగభూషణం, వీరారెడ్డి, విజయ్‌కుమార్, వెంకటేశం, శ్రీధర్, అశోక్‌గౌడ్, శివాజీరావు, పత్తివీరేషం, మల్లికార్జున్, లింగాగౌడ్, శివశేకర్. వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.


అందోల్‌లో అలయ్‌బలయ్‌లో మాట్లాడుతున్న మాజీస్పీకర్ మధుసూదనాచారి


అందోల్ అలయ్‌బలయ్‌లో మాజీఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను ఆలింగనం చేసుకుంటున్న మాజీమంత్రి హరీశ్‌రావు


సంగారెడ్డి జిల్లా అందోల్‌లో అలయ్‌బలయ్ కార్యక్రమానికి హాజరైన ప్రజలు, కార్యకర్తలు


తొగుట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# రైతుహితమే ధ్యేయంగా పని చేయాలి

- రైతును రాజు చేసిన ఘనత కేసీఆర్‌దే..
- కాంగ్రెస్ పాలనలో రుణమాఫీ కాలేదు.. రైతు భరోసా జాడే లేదు
- తొగుటలో విలేకరులతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, అక్టోబర్ 14: రైతుహితమే ధ్యేయంగా పని చేయాలని, రైతును రాజు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తొగుట వ్యవసాయ మార్కెట్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరువుతో విలవిలలాడిన దుబ్బాక నియోజకవర్గంలో గోదావరి జలాలు పారించి సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎక్కడో ఉన్న గోదావరి జలాలను కాళేశ్వరం ద్వారా నీళ్లు నిల్వ చేసుకుంటున్నామన్నారు. రైతుకు 24 గంటల కరెంటు రైతుబంధు, రైతు బీమా అందించి ఆదుకున్నామని చెప్పారు. కరువుకాటకాలకు నిలయమైన దుబ్బాక నియోజకవర్గం నేడు పాడిపంటలకు నిలయంగా మారిందన్నారు. ఉమ్మడి జిల్లాలోనే ధాన్యం ఉత్పత్తిలో దుబ్బాక నియోజకవర్గం ముందువరుసలో నిలుస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**ముత్తన్నకు మచ్చ తేవొద్దు**

చివరి శ్వాస వరకు కేసీఆర్ బాటలో సాగిన మాజీ మంత్రివర్యులు చెరుకు ముత్యంరెడ్డికి మచ్చ తీసుకురావద్దని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేగా అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వస్తే కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం విడ్డురంగా ఉందన్నారు. రుణమాఫీ,రైతు భరోసా, కల్యాణలక్ష్మి, తులం బంగారం, ఆసరా పింఛన్లు రూ.4వేలకు పెంచలేదని అడిగితే మమ్మల్ని అడ్డుకుంటారా అని ప్రశ్నించారు. రైతుల కోసం ముత్యంరెడ్డి పనిచేశారని, మీకు చేతనైతే మల్లన్నసాగర్ ద్వారా పంట పొలాలకు సాగునీరు అందేలా కాలువల నిర్మాణం కోసం నిధులు తీసుకురావాలన్నారు. అభివృద్ధిని కోరుకునే ముత్యంరెడ్డి బాటలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీఎం రాజయ్య, మధుసూదన్, తహసీల్దార్ శ్రీకాంత్, మండల వ్యవసాయాధికారి మోహన్, ఏపీఎం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ కార్యదర్శి స్వామి, మహిళా సమైక్య అధ్యక్షురాలు వడ్ల మంజుల, రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ స్పెషల్ బాదుడు


ప్రయాణికులతో కిక్కిరిసిన సిద్దిపేట ఆర్టీసీ బస్టాండ్

నర్సాపూర్, అక్టోబర్14: దొరికిందే సందన్నట్లు ఆర్టీసీ యాజమాన్యం టికెట్ రేట్లు పెంచి ప్రయాణికుల నడ్డి విరుస్తుంది. దసరా పేరుతో స్పెషల్ బస్సులంటూ ప్రయాణికుల నుంచి అధిక రేట్లు వసూలు చేస్తూ ప్రయాణికులను నిలువునా ముంచుతుంది. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో అధిక రేట్లకు టికెట్లు ఇవ్వడంతో ప్రయాణికులు ఆగ్రహానికి గురయ్యారు. నర్సాపూర్ బస్టాండ్ ఎదుట బస్సులు నిలిపి ఆందోళన చేపట్టారు. పైగా పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డు పెట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులు మాట్లాడుతూ స్పెషల్ పేరుతో ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికులను నిలువునా ముంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా రేట్లు పెంచడంతో కూలీకి వెళ్లే వాళ్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నర్సాపూర్ నుంచి సికింద్రాబాద్ వరకు రూ.60 ఉంటే నేడు రూ.130 వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం పోలీసులు అక్కడకు చేరుకొని ఏదైనా సమస్య ఉంటే డిపో యాజమాన్యంతో మాట్లాడుకోవాలని నచ్చజెప్పారు. ఆర్టీసీ సిబ్బందిని సంప్రదించగా దసరా సందర్భంగా ఈ ఒక్క రోజే టికెట్‌పై ఎక్కువ రేటు చార్జ్ చేశామని చెప్పారు.

**స్పెషల్ బస్సుల పేరిట అదనపు చార్జీలు**

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 14: పండుగ పబ్బం ఏదైనా సరే సాధారణ చార్జీలతోనే బస్సులను నడుపుతామని చెప్పిన ప్రజా రవాణా ఆర్టీసీ దసరాకు మాట తప్పింది. పండుగకు స్వగ్రామాలకు వెళ్లిన ప్రయాణికుల నుంచి అదనపు బస్సు చార్జీలను ముక్కు పిండి వసూలు చేసి ప్రయాణికుల నమ్మకాన్ని కోల్పోయింది. స్పెషల్ బస్సుల పేరట అదనపు చార్జీల వసూళ్లకు తెరలేపింది. సుమారు 30శాతం చార్జీలు పెంచి అదును చూసి దెబ్బ కొట్టింది. పండుగకు ముందు సిద్దిపేట నుంచి జేబీఎస్ 140 రూపాయలను తీసుకున్న ఆర్టీసీ తిరుగు ప్రయాణంలో టికెట్ ధరను అమాంతం రూ.200లకు పెంచిం ది. అదే విధంగా హన్మకొండ నుంచి హైదరాబాద్ సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణం సాధారణంగా రూ.300 ఉంటే పండుగ వేళ 420 రూపాలను పెంచి వసూలు చేసింది. ప్రభుత్వం తమ అవసరాన్ని ఆసరాగా చేసుకొని అదుపు చార్జీలను వసూలు చేయండంపై ప్రయాణికులు ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బస్సుల కోసం పడిగాపులు...**

చేగుంట, అక్టోబర్14: దసరా, బతుకమ్మ పండుగలకు సొంతూరు వెళ్లిన ప్రయాణికులకు తిరుగు ప్రయాణంలో సరైన బస్సులు లేక తిప్పలు తప్పడం లేదు. గ్రామాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు వచ్చే బస్సులు కిక్కిరిసిన ప్రయాణికులతో రావడంతో గంటల తరబడి వేచి ఉన్నా ఎక్కేందుకు స్థలం లేక బ్యాగులు, వస్తువులు పట్టుకొని బస్టాండ్లలో నిలబడిపోయారు.


నర్సాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

## తెలంగాణ ఉద్యమకారుడు విజయరామరాజు మృతి



పెద్దశంకరంపేట, అక్టోబర్ 14: కేసీఆర్, హరీశ్‌రావు సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ఉద్యమ కెరటం మాజీ జడ్పీటీసీ భూత్కూరి విజయరామరాజు(45) ఆదివారం హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. ఉద్యమంలో మంచి గుర్తింపు పొందిన నాయకుడిగా సేవలందించాడు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా బీఆర్‌ఎస్ అధిష్టానం జడ్పీటీసీ టికెట్ ఇవ్వడంతో జడ్పీటీసీగా గెలుపొందారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల పెద్దశంకరంపేటలో వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఆయన స్వస్థలం పెద్దశంకరంపేట మండలం మల్కాపురం గ్రామం, గతంలో మల్కాపురం గ్రామసర్పంచ్‌గా, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడిగా, జడ్పీటీసీగా పనిచేశారు. మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావుతోపాటు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా కార్యకర్తలకు అందుబాటులోఉంటూ మంచిపేరు తెచ్చుకున్నారు.

## విజయరామరాజు కుటుంబాన్ని ఆదుకుంటాం


విజయరామరాజు భార్యాబిడ్డలను ఓదార్చుతున్న మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు

**మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు**

పెద్దశంకరంపేట, అక్టోబర్ 14: మండల మాజీ జడ్పీటీసీ భూత్కూరి విజయరామరాజు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట మండలం మల్కాపురం గ్రామంలో విజయరామరాజు మృతి చెందడంతో ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో మాజీమంత్రి పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. విజయరామరాజు ఇద్దరు కూతుళ్లను అన్నివిధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు. విజయరామరాజు మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరనిలోటన్నారు. అంత్యక్రియల్లో ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్‌లు పాడె మేశారు. ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పద్మ దేవేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, శివకుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మురళీపంతులు, అలుగుల సత్యనారాయణ, కోనం విఠల్, రాయిని మధు, నారాగౌడ్, ఆర్ఎన్ సంతోష్‌కుమార్, సంగమేశ్వర్, దత్తు, రమేశ్ తదితరులున్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

- మెదక్ జిల్లాలో 480 సెంటర్ల ఏర్పాటుకు కసరత్తు
- సన్నరకం సేకరణకు 93 కేంద్రాలు
- 7 లక్షల టన్నుల దిగుబడి అంచనా
- ప్రస్తుతం అందుబాటులో 40 లక్షల గన్నీ బస్తాలు
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు
- త్వరలో ప్రారంభం కానున్న వరి కోతలు
- సన్నాలకు ఈసారి నుంచి రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటన


తొగుటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మెదక్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): వానకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. మెదక్ జిల్లాలో దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. మరో 15 రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా 480 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయానికి వచ్చారు. మెదక్ జిల్లాలో ఈ వానకాలంలో 2,97,399 ఎకరాల్లో వరి సాగైంది. అందులో 1,04,974 ఎకరాల్లో సన్నరకం వరి, 1,93,365 ఎకరాల్లో దొడ్డురకం వరి సాగైనట్లు అధికారులు తెలిపారు.


**7 లక్షల టన్నుల దిగుబడి అంచనా ..**

మెదక్ జిల్లాలో 2,97,339 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో దొడ్డురకం 5 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, సన్నరకం 2.30 లక్షల మెట్రిక్ టన్నుల మేర వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇందులో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయనున్నారు. ప్రతి సీజన్‌లో రైతులు తమ ఇంటి అవసరాల కోసం వానకాలంలో సన్నరకం వడ్లను వాడుకుంటారు. బహిరంగ మార్కెట్‌లో రెండేండ్లనుంచి సన్నరకం ధాన్యానికి మంచి ధర ఉండడంతో మిల్లులు, బహిరంగ మార్కెట్లకు రైతులు ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఈసారి ప్రభుత్వ కొనుగోలు సెంటర్లకు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం వచ్చే అవకాశం ఉంది. దొడ్డురకం 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని భావిస్తున్నారు. ఆ మేరకు సేకరణకు సివిల్ సప్లయ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

**40 లక్షల గన్నీ బస్తాలు అందుబాటులో...**

మెదక్ జిల్లాలో ధాన్యం సేకరణకు కోటి గన్నీ బస్తాలు అవసరం ఉండగా, ప్రస్తుతం 40 లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. ఈ సీజన్‌లో సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 93 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సన్నవరి సాగు ఎక్కువగా ఉన్న మండలాల్లో మరికొన్ని సెంటర్లు పెంచే అవకాశం ఉంది. సన్నధాన్యాన్ని గుర్తించేందుకు అందుబాటులోకి మిషన్ వచ్చింది. దీంతో పాటు మరో రెండు మిషన్లు వచ్చాయని అధికారులు తెలిపారు.

## ధాన్యం సేకరణకు ఏర్పాట్లు



వానకాలం సీజన్ ధాన్యం సేకరణకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండాఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లావ్యాప్తంగా 480 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇందులో 93 కేంద్రాల్లో సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. ఈ సీజన్‌లో 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేశాం. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బస్తాలను అందుబాటులో ఉంచుతాం. దళారులను నమ్మి మోసపోవద్దు.. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోకే రైతులు ధాన్యాన్ని తరలించి మద్దతు ధర పొందాలి.

– హరికృష్ణ, సివిల్ సప్లయ్ డీఎం, మెదక్